

కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్ అభివృద్ధే ధ్యేయం

హయత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డివిజన్ పరిధిలోని మహా గాయత్రీనగర్ కాలనీలో ఎంపీ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఎంపీ ఈటల రాజేందర్, అధికారుల సహకారంతో అన్ని రకాల అభివృద్ధి పనులు చేశామని అన్నారు. మిగిలినా పనులను త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవి సింగ్, లింగం, మధు, చుక్కారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, సుజాత, శ్రీదేవి, ఉమాకాంత్, శంకర్, నరేందర్‌రెడ్డి, సోమయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

వనస్థలిపురంలో సమస్యల పరిష్కారానికి చర్యలు

వనస్థలిపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లోని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ రేడియా కాలనీలో కమ్యూనిటీ హాల్, పార్కు నిర్మాణపు పనులకు కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారిగ పరిష్కరిస్తు డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఎస్టీపీకి వ్యతిరేకంగా నిరసన దీక్షలో కూర్చున్న పెద్దఅంబర్‌పేట్ నేతలు, కాలనీవాసులు

ఎస్టీపీ బాధితుల వంటా - వార్పు

● సర్వే నెంబర్ 83లోకి ఎస్టీపీని తరలించాలని డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ సర్వే నంబర్ 292లో ఎస్టీపీ బాధితులు చేపట్టిన నిరసన దీక్షలు 5వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం దీక్ష శిబిరం వద్ద అంబికానగర్, పోలీస్‌కాలనీ, ఆయాకర్‌రెడ్డి కాలనీ వాసులు స్థానిక నాయకులతో కలిసి వంటా-వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డుపైనే భోజనాలు చేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ ఎస్టీపీ ఏర్పాటుకు అనుకూలంగా పెద్దఅంబర్‌పేట్ సర్వే నెంబర్ 83లో ప్రభుత్వ భూమి ఉన్నదని ప్లాంట్‌ను అక్కడికి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్లాంట్‌ను మరోచోటకు తరలించే వరకు దీక్షలు కొనసాగిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధంకి కృష్ణారెడ్డి, పంగుడుల రాజు, దండెం రాజశేఖర్‌రెడ్డి, వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి, చల్లూరి మురళీధర్‌రెడ్డి, నాగార్జున, రాజు, చెట్టుపలి అంబేడ్కర్‌తో పాటు ఆయా కాలనీ వాసులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

తలసేమియా బాధితుల కోసం రక్తదానం

మన్సూరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తదానం చేయడం అభినందనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కాస్మోపాలిటన్ కాలనీ పార్కు ప్రాంగణంలో కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అదేవిధంగా హార్ట్ అటాక్‌తో కుప్పకూలిన వారికి తక్షణమే సీపీఆర్ చేయడంపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనరసింహ, ఆస్పత్రి మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఏఆర్ఎస్ సత్యనారాయణ, బ్లడ్‌బ్యాంక్ హెచ్ఓడీ డా.వివేకానంద, డా.పునీత్, తలసేమియా కోఆర్డినేటర్స్ యాదగిరి, సురేందర్, సీపీఆర్ ప్రోగ్రాం ఇన్‌చార్జి డా.డెవిజన్, డా.ఆకర్షిత, సిబ్బంది, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణానగర్‌కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడలో అభివృద్ధికి కోట్ల రూపాయలు

ఎల్బీనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి సీఎం కావడం వల్లే లింగోజిగూడలో అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులు వస్తున్నాయని జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌లో రూ. 34.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డును రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. డివిజన్‌లో ఏ సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లింగోజిగూడ డివిజన్‌కు తీసుకొచ్చి సరూర్‌నగర్ చెరువు సుందరీకరణ, కట్ట అభివృద్ధి, ట్రంక్‌లైన్ పనులతో పాటు కొత్త బ్రిడ్జి నిర్మాణం వంటి ప్రధాన పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా..

అక్రమ నిర్మాణాలను పట్టించుకునేవారేరీ?

- ఫిర్యాదులు వచ్చినా స్పందించని అధికారులు
- జీహెచ్ఎంసీ తీరుపై మండిపడుతున్న జనం

సైదాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సైదాబాద్, ఐఎస్‌సదన్, అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అనుమతులు ఒకలా తీసుకుని, నిర్మాణాలు మరోలా చేపడుతూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. లక్ష్మీనగర్ కాలనీ చౌరస్తాలో నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకరంగా చేపట్టిన సెల్లార్ నిర్మాణాన్ని అధికారులు రెండుసార్లు సీజ్ చేశారు. అయినా బిల్డర్ తాళాలు పగులగొట్టి తిరిగి పనులు ప్రారంభించినా అధికారులు చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు. కొందరు అధికారులు చర్యలు తీసుకోవాలని అనుకున్నా 'అది మనోళ్లదే.. దాని జోలికి వేళ్లితే బాగుండదు' అనే హెచ్చరికల నేపథ్యంలో ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, కనీసం పార్కింగ్ సదుపాయం, సెట్‌బ్యాకులు లేకపోయినా.. పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ డివిజన్‌లలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, టీపీఎస్, చైన్‌మెన్‌లు కొందరు కేవలం కలెక్షన్లపైనే దృష్టిసారించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేస్తే దాని ఆధారంగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి వెళ్లి అందినంత దండుకుని వస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో

సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఎన్ఓసీ లేకున్నా జీహెచ్ఎంసీ అధికారులు యథేచ్ఛగా ఇంటి నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. సైదాబాద్ మండలం సింగరేణి కాలనీలోని సర్వేనెంబరు 126 నుంచి 136, 146,127లోని ప్రభుత్వ మిగులు భూమి(యూఎల్‌సీ)గా రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఇందులో దాదాపు 100 శాతం భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. ఆ భూమిలో ఎలాంటి భవన నిర్మాణాలను అనుమతి ఇవ్వొద్దని 20 ఆగస్టు 2011న అప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఎల్ఆర్ నెం: ఎస్8/10057/2010/2631 ద్వారా జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. జీఓ 640(18.04.1981) ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి ఆఫీసర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. కానీ కలెక్టర్ ఆదేశించినా సదరు భూముల్లో యథేచ్ఛగా జీహెచ్ఎంసీ అధికారులు అనుమతులు ఇస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి సైదాబాద్ మండలం, సరూర్‌నగర్ మండలం పరిధిలోకి రావడంతో రెవెన్యూ అధికారులు ఎవరికి వారు తమ పరిధి కాదంటూ ముఖం చాటేస్తున్నారు.



లక్ష్మీనగర్ చౌరస్తాలో సీజ్ చేసిన తిరిగి కొనసాగుతున్న నిర్మాణం



సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు

చర్యలు తీసుకోలేకపోతున్నాం : టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఒత్తిళ్లతోనే తాము అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోలేకపోతున్నామని టౌన్‌ప్లానింగ్ కింది స్థాయి సిబ్బంది వాపోతున్నారు. పలుమార్లు అక్రమ నిర్మాణాలను అడ్డకునేందుకు తాము వెళ్లగా అక్కడికి ఎందుకు వెళ్లారంటూ ఓ ప్రజాప్రతినిధి తమను చివాట్లు పెట్టినట్టు వారు తెలిపారు. ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని, తాము ఏమి చేయలేకపోతున్నామని వారు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్ స్పందించి అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు పేర్కొన్నారు.

వర్షాలకు తాళాలు ఊడిపోవచ్చు



సీజ్ చేసిన తాళాలు రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా ఊడిపోవచ్చు. సదరు భవన సెల్లారు నిర్మాణ పనులకు ఎలాంటి అనుమతులు లేవు. గతంలోనే సెల్లారు నిర్మాణ పనులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ప్రస్తుతం మళ్లీ నిర్మాణ పనులు చేపడితే వెంటనే నిలిపివేయాలి.

- భానుచందర్, ఏసీపీ, సంతోష్‌నగర్ సర్కిల్

సాహిత్య కళారూపకంగా కవిత్వం

● ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలే లక్ష్మణ్, బి.నర్సింగ్‌రావు తదితరులు

బర్కత్‌పుర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆనాడు నాటకం కళారూపకంగా నిలబడగా నేడు కవిత్వం సాహిత్య కళారూపకంగా నిలబడుతుందని ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు అన్నారు. సాహిత్యంలో కవిత్వం భాగమైనప్పుడు నిగూఢత లేకపోతే అది నిలబడలేదన్నారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పసునూరు శ్రీధర్‌బాబు రచించిన ఏకాంతం ఒక అతిథి కవిత పుస్తకాన్ని ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.నర్సింగ్‌రావు మాట్లాడుతూ కవిత్వం ఒక వ్యసనం వంటిదని, అందులో దిగిన వారు బయటకు రావడం కష్టమన్నారు. కళాత్మకమైన విలువలు తెలిసిన కవి శ్రీధర్‌బాబు అని కొనియాడారు. తెలుగులో కవిత్వం రాసేవారు చాలామంది ఉన్నారని, వారు బయటి ప్రపంచాన్ని పట్టించుకోరని అన్నారు. తెలంగాణ అస్తిత్వ దోరణిలో వస్తున్న కవితలో శ్రీధర్‌బాబుది డిఫరెంట్ దోరణి అని భిన్నమైన శైలిలో కవిత్వాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ మాట్లాడుతూ అద్భుతమైన కవిత్వాన్ని సమాజానికి అందించారని అన్నారు. ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ న్యాయవాదిగా కొనసాగడం ఇష్టం లేక రచనలపై ఆసక్తితో జర్నలిజంలోకి శ్రీధర్‌బాబు అడుగుపెట్టారని అన్నారు. కార్యక్రమంలో రచయిత్రి విమల, రచయిత సిద్ధార్థ, కవి ప్రసాదమూర్తి, పసునూరు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

భక్తిశ్రద్ధలతో జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు

మన్సూరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీ పార్కులో చతుర్వేద హవన సహిత జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సూర్య నమస్కారాలు, అరుణ హోమం వంటి పూజా కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. ధర్మరక్ష సంస్థ ఆధ్వర్యంలో జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీ అసోసియేషన్ సభ్యుల సహకారంతో జరిగిన ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవాలు దానం



మధుసూదన్(ఫైల్)

మన్సూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేసి ఆదర్శంగా నిలిచింది ఓ కుటుంబం. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా పిన్నాయిపల్లి గ్రామానికి చెందిన చింత చిన్ననర్సయ్య, సైదమ్మ దంపతుల రెండో కుమారుడు చింత మధుసూదన్(35)కు భార్య జ్యోతి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో నగరంలోని లక్ష్మీకపూల్‌లో నివాసముంటూ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మధుసూదన్ కుమారులిద్దరూ యాదాద్రి- భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. చిన్నకుమారుడికి జ్వరం వచ్చిందని పాఠశాల ప్రిన్సిపాల్ గురువారం మధుసూదన్‌కు ఫోన్ చేయగా వెంటనే కుమారుడిని చూసేందుకు బయల్దేరాడు. ఈ క్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా అదేరోజు కామినేని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. తలకు తీవ్రంగా గాయాలై బ్రెయిన్‌డెడ్ కావడంతో మధుసూదన్ ఆదివారం ఉదయం మృతిచెందారు. వైద్యబృందం అవయవదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు సుముఖత తెలపడంతో మధుసూదన్ కాలేయం, కిడ్నీలు, కంటి కార్నియాలు దానం చేశారు.

బాలుడిపై వీధికుక్కల దాడి బాధాకరం



బాలుడిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తున్న జక్కిడి రఘువీర్‌రెడ్డి

మన్సూరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన ఓ మూగ బాలుడిపై వీధికుక్కలు దాడి చేయడం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ మన్సూరాబాద్ యువనాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శివగంగకాలనీలో కుక్కలు దాడి చేసిన ఘటనా స్థలాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు జక్కిడి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.10వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ శివగంగకాలనీలో చెత్త సేకరణ సరిగ్గాలేకపోవడంతోనే వీధికుక్కలు అక్కడ చేరి ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయని అన్నారు. స్థానిక కార్పొరేటర్ అసమర్థత కారణంగానే చెత్త సేకరణ సరిగ్గాలేక సామాన్య ప్రజలు బలవుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శివగంగకాలనీ అధ్యక్షుడు తొంట బాబు, గిరి, శ్రీనివాస్‌గౌడ్, దిగ్విజరెడ్డి, మిర్యాల రమేష్, జానకిరామయ్య, అనిల్‌కుమార్, వీరన్నగుట్ట కాలనీ అధ్యక్షుడు నర్సింహాయాదవ్, కేకేఎల్ గౌడ్, ఎల్లస్వామి, శ్రీకాంత్, హరిగౌడ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

నిరసన కార్యక్రమానికి బీజేపీ నేతలు..



ప్రజావంచన కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి బీఎన్‌రెడ్డినగర్ నుంచి తరలివెళ్తున్న రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు గంగం ప్రేమ్‌నాథ్, తదితరులు

- వనస్థలిపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి)

జీవో నెంబర్ 137ను రద్దు చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సొసైటీ నేతలు

కవాడిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 137ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ లెదర్ ఆర్టిజన్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, కార్యదర్శి ములుగు రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ లెదర్ ఇండస్ట్రీ ప్రమోషన్ ఆఫ్ కార్పొరేషన్‌లో గల 43ఎకరాల భూముల్లో 3.21 ఎకరాలను పెట్రోల్ బంకులకు 33 సంవత్సరాల పాటు లీజుకు ఇస్తున్నామని జీవో నెంబరు 137ను ప్రభుత్వం తీసుకువచ్చిందని ఈ జీవో వల్ల మాదిగ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జీవో నెంబర్ 137ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5.16 ఎకరాలలో యూనిట్ మాల్, యాభై అంతస్తులలో వాణిజ్య సముదాయాలకు మాల్ నిర్మించబోతున్నామని ప్రభుత్వం ప్రకటించిందని ఈ మాల్‌లో లెదర్ ఉత్పత్తుల కోసం వాణిజ్య సముదాయాన్ని కేటాయిస్తామని ఎక్కడా పేర్కొనలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్పొరేట్ వాణిజ్య సముదాయాల ఏర్పాటును వెంటనే నిలిపివేయాలి లేదా మాకు అందులో యాభై శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రవీందర్, మోగిలి, కొండయ్య, రాంబాబు, ఓంప్రకాష్, రమేష్ జాన్ సతీష్, రాజు, శ్యాం పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు మహిళల అరెస్ట్

● 2.40 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు వారి నుంచి 2.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని మేజర్ బస్తీ, అఫ్జల్‌గంజ్, ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నిఘా పెట్టారు. గంజాయి విక్రయిస్తున్న ముఠాలోని బాలువాబాయి, కాంబ్లే గలన్‌బాయిని అరెస్ట్ చేశారు. వారి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న 532 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి ప్యాకెట్లు 2.40 కిలోలు ఉన్నాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గంజాయి సరఫరా, విక్రయాల్లో వీరికి సహకరిస్తున్న రాజు, గజేందర్, రాజేందర్, రాజన్ అలియాస్ చోటు, గణేష్, రాగుల్, జిలేబి, గున్‌గున్, శ్రీకర్ వందన, పున్నం, కాంబ్లే ఆకాష్‌లపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

గోషామహల్లో నకిలీ టూల్స్ గుట్టు రట్టు

● లబ్ధి ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసుల దాడి

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గోషామహల్ ప్రాంతంలో యథేచ్ఛగా సాగుతున్న నకిలీ ఇండస్ట్రియల్ టూల్స్ విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పక్కా సమాచారంతో సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, బేగంబజార్ పోలీసులతో కలిసి నిర్వహించిన దాడుల్లో లబ్ధి ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో నిల్వ ఉంచిన నకిలీ కాన్వీ టీసీటీ సా బ్లేడ్లను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు దుకాణాల్లో ఈ దాడులు చేపట్టారు. 2019 నుంచే లబ్ధి ఎంటర్‌ప్రైజెస్ కాన్వీ నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. దీంతో కాన్వీ బ్రాండ్‌కు ఆర్థికంగా నష్టం కలగడంతో పాటు వినియోగదారుల భద్రతకు ముప్పు ఏర్పడిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీటిని ల్యాబ్ పరీక్షలకు పంపించారు. దీని మూలాలు గుర్తించేందుకు, ఈ నెట్‌వర్క్ ఉన్న వారిని పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇండస్ట్రియల్ టూల్స్ నకిలీవి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్లు: 9959154371, 9963980259లలో దయచేసి సంప్రదించాలని తెలిపారు.



పడిపూజలో గురుస్వామి పుల్లూరి ఉపేందర్ గుప్తా తదితరులు

వైభవంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం

సైదాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప 18వ మహాపడిపూజ మహోత్సవాన్ని చంపాపేట ఎస్వీ సెరినీలో ఆదివారం గురుస్వామి పుల్లూరి ఉపేందర్ గుప్తా ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి, సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. భజనలతో చంపాపేట పరిసరాలు అయ్యప్ప నామస్మరణతో మారుమోగాయి. పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాపూజలో గోపాల్ గురుస్వామి, రవి, మాల్యాద్రి పాల్గొన్నారు.

ఇన్‌కంట్యాక్స్‌కాలనీలో ఘనంగా గీతా జయంతి



చిన్నారులకు జ్ఞాపికను అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ కేపురం ఇన్‌కంట్యాక్స్ కాలనీలో గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాదికాలు, గీతా శ్లోక పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఇస్రో శాస్త్రవేత్త డి.వెంకట్‌రమణి హాజరై మాట్లాడారు. భగవద్గీత మనిషికి మార్గదర్శనం చేస్తుందని అన్నారు. భగవద్గీత శ్లోకాలు పఠించిన చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజశ్రీ రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, అన్నపూర్ణ, మాధవి కులకర్ణి, అంజనీకృష్ణ, ప్రత్యూష, కోటేశ్వరమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీ నూతన కార్యవర్గం



అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి

చంపాపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా మంఖాల శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్ యాదవ్, కోశాధికారిగా నాయిని ధర్మారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. తన ప్యానల్‌ను గెలిపించినందుకు గాను ఆయన కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాలనీలో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

దిల్‌సుఖ్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చైతన్యపురి డివిజన్ సీనియర్ నాయకులు కె.శశిధర్‌రెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్‌చౌక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ ఫ్లోర్‌లీడర్ బద్దుల వెంకటేష్‌యాదవ్, సీనియర్ నాయకులు కూకుట్లపల్లి సత్యనారాయణ, తుడి గోవర్ధన్, వెంకటేష్‌చారి, వినోద్‌కుమార్, సురేష్, శరత్, ప్రశాంత్‌గౌడ్, బబ్లూ, లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, డానియల్, యాదయ్య, శంకర్‌లు పాల్గొన్నారు.